క్లుప్తంగా

వైఎస్సార్‌టీపీకి రాజీనామా


నీరజ

మానకొండూర్: వైఎస్సార్ టీపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి, పార్టీ క్రియాశీల సభ్యత్వానికి దుబ్బ నీరజ సోమవారం రాజీనామా చేశారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి కష్టపడి పనిచేశానని, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పోటీకి దూరంగా ఉంటున్నామని ప్రకటించడంతో కలత చెందానన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ రాజశేఖర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ బోధించేందుకు సంబంధిత సబ్జెక్టులో పీజీ, పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగినవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఓసీ, బీసీలు 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, బయోడేటా, విద్యా అర్హతలతో 10వ తేదీ సాయంత్రం వరకు అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీలతకు దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

వీణవంకలో ఫ్లాగ్ మార్చ్


జెండా ఊపుతున్న అధికారులు

వీణవంక: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు నుంచి పోలీస్ స్టేషన్ వరకు బీఎస్ఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. లా అండ్ ఆర్డర్ డీసీపీ లక్ష్మీనారాయణ జెండా ఊపి మార్చ్ ప్రారంభించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ కిశోర్, ఎస్సై ఆసిఫ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత


ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

మానకొండూర్: మండల కేంద్రానికి చెందిన వేముల బాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. తనతోపాటు చదువుకున్న 1995–96 పదో తరగతి స్నేహితులు సోమవారం రూ.26వేల నగదును మృతుడి భార్య అనితకు అందజేశారు. ఇక్కడ మిత్రులు దండు లక్ష్మణ్, గసిగంటి సంపత్, నరేందర్, సత్యేందర్, సంపత్, అంజయ్య, ప్రవీణ్, అంజయ్య తదితరులు ఉన్నారు.

మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం


పరుగు పందెం పోటీల్లో విద్యార్థులు

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో సోమవారం మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయని ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి సొల్లు సారయ్య తెలిపారు. వంద మీటర్ల పరుగు బాలికల విభాగంలో ఏకశిలా పాఠశాలకు చెందిన జె.అక్షయ, పెద్దపాపయ్యపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన టి.గంగోత్రి, 200 మీటర్ల పరుగు పందెంలో ఏకశిలకు చెందిన జె. అక్షయ, ఎంజేపీఎస్‌కు చెందిన సీహెచ్ అక్షయ, 400 మీటర్లలో జె. అక్షయ ఏకశిలా, హుజూరాబాద్ జెడ్పీహెచ్ఎస్‌కి చెందిన హరిణి గెలుపొందగా, బాలుర విభాగంలో 200 మీటర్లలో హుజూరాబాద్ పాఠశాలకు చెందిన రాజ్‌కుమార్, సిర్సపల్లికి చెందిన హర్షవర్ధన్, 400 మీటర్లలో సిర్సపల్లికి చెందిన వెంకటేశ్, రామ్‌చరణ్, 800 మీటర్లలో రామ్‌చరణ్, హర్షవర్ధన్ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రవికుమార్, భాగ్యలక్ష్మీ, శ్రీనివాస్‌రావు, ప్రవీణ్, అనిల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎన్నికల పాఠం.. ఎంతో ముఖ్యం

- పదో తరగతిలో ప్రత్యేక పాఠ్యాంశం
- ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం


చెల్పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల నిర్వహణపై పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

హుజూరాబాద్‌రూరల్: తొమ్మిదో తరగతి నుంచే విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తామని, కేంద్ర మంత్రిత్వశాఖతో ఒప్పందం కుదుర్చుకున్నామని భారత ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్‌కుమార్ ఇటీవల పేర్కొన్నారంటే ఓటుకు ఎంతో ప్రాధాన్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా యువత ఓటింగ్‌పై ఆసక్తి చూపడం లేదు. వారి ఓటింగ్ శాతం తక్కువగా ఉండటం, ఆశించినదగిన పరిణామం కాదు. ఈ నేపథ్యంలో చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించి 18 ఏళ్లు నిండేసరికే వారు ఓటుహక్కు పొందేలా సిద్ధం చేయాలన్నదే ఎన్నికల సంఘం లక్ష్యం. అంతేకాదు పోలింగ్‌పై అవగాహన, ప్రజాస్వామ్యం అంటే ఏమిటో తెలియజేయడం అవసరం . ఈ నేపథ్యంలో పదో తరగతిలో భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ పేరుతో ఓ పాఠ్యాంశం ప్రజాస్వామ్యం, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలను తెలియజేస్తోంది. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి, విద్యార్థులు పాఠ్యాంశాన్ని వాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకోనున్నారు.

ఎన్నికల సంఘంపై అవగాహన...

భారత ఎన్నికల వ్యవస్థ ఏర్పాటు విధులు, ఎలాంటి ప్రతిపత్తి కలిగినది అనే విషయాలను పాఠ్యాంశంలో స్పష్టంగా వివరించారు. 1950 జనవరి 25న ఏర్పడిన భారత ఎన్నికల సంఘం గూర్చి, తదనంతరం కాలంలో ప్రధాన కమిషనర్ పదవికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన టీఎన్ శేషన్ సేవలను వివరించారు. భారత రాజ్యాంగం 15వ భాగంలోని ఆర్టికల్ 324 నుంచి 329 వరకు సంఘం నిర్మాణంలో జరిగిన మార్పులు, పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు తదితర విధులు ఈ పాఠ్యాంశంలో తెలుసుకోవచ్చు.

పోలింగ్ నిర్వహణపై..

18 ఏళ్లు నిండితే ఓటుహక్కు కల్పించే విషయంతో పాటు పోలింగ్ రోజు అధికారులు, పోలింగ్ ఏజెంట్ల విధులను వివరించారు. స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా అధికారులు కల్పించే ఏర్పాట్లను తెలిపారు. దీంతో పాటుగా పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి పరిస్థితి ఉంటుంది. ఈవీఎం, వీవీ ప్యాట్లు ఎలా పనిచేస్తాయి? ఏ అధికారి, ఏ విధులు నిర్వహిస్తారు? పోలింగ్ చీటీలు, గుర్తింపు కార్డులు, ఏజెంట్ల వివరాలను పొందపరచడంతో ఎన్నికల ప్రక్రియ విద్యార్థులకు చక్కగా అర్థమవుతోంది. ఎన్నికల సంఘం గుర్తులను ఎలా కేటాయిస్తుంది.. ఓట్ల శాతాన్ని బట్టి జాతీయ పార్టీ లేదా ప్రాంతీయ పార్టీగా ఎలా గుర్తిస్తారో వివరించారు. నోటా ఎప్పుడు ప్రవేశపెట్టారు? ఎందుకు వినియోగించాలనే విషయాలున్నాయి. ఉపాధ్యాయులు విద్యార్థులక విపులంగా వివరించడంతో విద్యార్థి దశ నుంచే ఎన్నికలపై పూర్తి స్థాయిలో అవగాహన కలుగుతోంది. వీటిపై తమ ఆలోచనలను విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్‌గా సైతం రూపొందిస్తున్నారు.

నోటుకు అమ్ముకోవద్దు



ఎన్నికల విధానంపై పుస్తకంలో పాఠ్యాంశం ఉంది. ఇప్పటికే పాఠం మా టీచర్ చక్కగా వివరించారు. పాఠం ద్వారా ఓటు ఎంత విలువైందో తెలుసుకున్నా. నోటాకు ఓటు వేయడం వల్ల జరిగే ప్రయోజనాలను తెలుసుకున్నా. ప్రస్తుతం గ్రామాల్లో ఎన్నికల హడావుడి ఉంది. నోటుకు ఓటు అమ్ముకోవద్దు. నిస్వార్థ నాయకులకు ఓటు వేయాలని, ఇంట్లో వారితోపాటు తెలిసిన వారికి చెబుతా.

– గుర్ల భరత్, పదోతరగతి, కందుగుల ప్రభుత్వ పాఠశాల

చాలా విషయాలు తెలుసుకున్నా



ఎమ్మెల్యే, సర్పంచ్ ఎన్నికలు జరిగినప్పుడు ఓటు ఎలా వేస్తారు? ఎందుకు వేయాలనే విషయాలు తెలిసేవి కాదు. పదో తరగతిలో పాఠం విన్నాక, ఎన్నో విషయాలు తెలిశాయి. ఓటర్లు డబ్బులు తీసుకోకుండా ఓటు వేస్తే మంచి నాయకుడిని ఎన్నుకోవచ్చు. అమ్మానాన్నకు ఇదేవిషయాన్ని చెబుతా. అయితే పాఠంలో చదివిన దానికి,వాస్తవ పరిస్థితులు కొంచెం భిన్నంగా కన్పిస్తున్నాయి.

– పి.తేజస్విని, పదోతరగతి, చెల్పూర్ ప్రభుత్వ పాఠశాల

ఎన్నికలు విలువైనవి



ఎన్నికల గూర్చి పాఠ్యాంశంతో చాలా తెలుసుకున్నాను. ఎన్నికల సంఘం మొదట బ్యాలెట్ బాక్సులు ఇప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్‌లను ఉపయోగిస్తోందని తెలిసింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి పోలింగ్ వరకు ఎన్నికల సంఘం చేసే పనులు అన్నీ పూర్తిగా తెలుసుకున్నాను. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ఎంతో విలువైనవి.

– జె.రవితేజ, పదోతరగతి, చెల్పూర్ ప్రభుత్వ పాఠశాల

నాణ్యత లోపంపై చర్యలు తీసుకోవాలి

చొప్పదండి: పట్టణంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనుల్లో నాణ్యతా లోపంపై చర్యలు తీసుకోవాలని డీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంశీ డిమాండ్ చేశారు. సోమవారం డివైడర్ పనులను పరిశీలించారు. ట్రస్మా నాయకులు ఇష్టారాజ్యంగా పనులు నిర్వహిస్తుడటంతో నాణ్యతా ప్రశ్నార్థకమైందన్నారు. పనులను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు, సిబ్బంది కనిపించక పోవడం దారుణమన్నారు. ప్రజా ధనం దుర్వినియోగమవుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఒకరిద్దరి జేబులు నింపడానికి ప్రజల సొమ్ము దుర్వినియోగం కావడం విచారకరమన్నారు. ఆయన వెంట సుంకె సంపత్, కొత్తూరి లక్ష్మణ్, కొల్లూరి రాజా, తదితరులు పాల్గొన్నారు.

పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

రామడుగు: మండల కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన పథకాన్ని పీఎం మోదీ మరో ఐదేళ్లకు పెంచడంతో బీజేపీ నాయకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు కట్ట రవీందర్, జిట్టవేని అంజిబాబు, బొమ్మకంటి భాస్కరాచారి, సత్యనారాయణాచారి, కనకయ్య, రాజు, శ్రీధర్, గంగయ్య, పలువురు పాల్గొన్నారు.

ఆపదలో చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలి


మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ సంపత్, మహిళా శిశు సంక్షేమ అధికారులు

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు ఆపదలో ఉంటే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం ఇవ్వాలని మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులు కోరారు. పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌ను సోమవారం సందర్శించారు. వసతులను అడిగి తెలుసుకున్నారు. బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, లైంగిక వేధింపులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో భాగ్యలక్ష్మి, డీసీపీవో శాంత, పీవోఎస్ఐసీ తిరుపతి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, ప్రిన్సిపాల్ మీనాక్షి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్‌రావు


సెంటర్ పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీలత

చొప్పదండి: మండలంలోని పదకొండు గ్రామాల్లో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అనంతరం డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,203 చెల్లించనున్నట్లు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట మార్కెటింగ్ డీపీఎం ప్రవీణ్, ఏపీఎం నర్మద, సిబ్బంది పాల్గొన్నారు.

గన్నేరువరం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ అధికారి కిరణ్మయి అన్నారు. మాదాపూర్, చీమలకుంటపల్లె, చొక్కారావుపల్లె గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఆరు, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో పది కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో కేంద్రాల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

మహాసభ విజయవంతం చేయాలి


రాంపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్, రంగాపూర్, జూపాక, కనుకులగిద్దె, దమ్మక్కపేట, బుడగజంగాల కాలనీల్లో సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు మాదిగల విశ్వరూప మహాసభ జన సమీకరణపై ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 11న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాదిగ ఉపకులాల విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలు దక్కుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రుద్రారపు రామచంద్రం, డాక్టర్ తడికమళ్ల శేఖర్, తునికి వసంత్, ఎర్ర రవీందర్, ఎర్ర పెద్ద లింగయ్య, స్వామి తదితరులు ఉన్నారు.

నియామకం


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నూతన కమిటీల నియామకం జరిగింది. నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్‌గా తునికి రవి, మండల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పెరుమాళ్ల భిక్షపతి, ఓబీసీ నియోజకవర్గ ప్రెసిడెంట్‌గా కుర్ర శ్రీనివాస్, బీసీ సెల్ టౌన్ చైర్మన్‌గా బరిగే మహిపాల్, ఓబీసీ చైర్మన్ మండల సమ్మెట సంపత్‌కుమార్ నియామకమయ్యారు. ఎన్నికైన కమిటీ బాధ్యులు మాట్లాడుతూ నియామకానికి సహకరించిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల ప్రణవ్, జిల్లా అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోలు రాము


నియామక పత్రం అందిస్తున్న కవ్వంపల్లి

తిమ్మాపూర్: మండల కేంద్రానికి చెందిన పోలు రాము కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ కార్యాలయంలో సోమవారం నియామకపత్రం అందించారు. నియామకానికి సహకరించిన పార్టీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగొని లక్ష్మీనారాయణగౌడ్, జిల్లా కార్యదర్శి మామిడి అనిల్‌కుమార్, గంకిడి లక్ష్మిరెడ్డి, గోగురి నర్సింహారెడ్డి, నగునూరి శ్రీనివాస్‌కు రాము కృతజ్ఞతలు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

జమ్మికుంట: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ అన్నారు. కళాశాలలో 3, 4, 5వ తరగతి విద్యార్థులకు తొలిమెట్టులో భాగంగా బోధన, పరీక్షలు నిర్వహణపై సోమవారం వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... చదవడం, రాయడంలో వెనుకంజలో ఉన్న విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీలత, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్లు రవి, రవీందర్, అధ్యాపకులు సువర్ణ, ఈశ్వరయ్య, భీమ్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న మల్లేశం

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ యూజింగ్ ఆర్డినో అంశంపై గెస్ట్ లెక్చరర్ మల్లేశం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్డినో ప్రాముఖ్యతను వివరిస్తూ, వివిధ రకాల సెన్సార్స్, డీసీ మోటార్స్, ఎల్‌సీడీ డిస్ప్లే, బజ్జర్ పరికరాలను ఎలా అనుసంధానం చేయాలో వివరించారు. అదే విధంగా ఆర్డినో ప్రోగ్రామింగ్, కోడింగ్ విధానం అప్లోడ్‌తో పాటు ఆర్డినో ఐడీఈ సాఫ్ట్‌వేర్ ఎలా చేయాలో తెలిపారు. అలాగే టింకల్ కార్డ్ సహాయంతో ఆన్‌లైన్‌లో సిములేషన్, బేసిక్ ఎల్ఈడీ బ్లింకింగ్ ప్రోగ్రామ్‌లను తెలియజేశారు. ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థులకు ఉపన్యాసం, కెరీర్ గైడెన్స్ వివరించారు. నైపుణ్యం, సృజనాత్మకత పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల జనరల్ సెక్రటరీ జి.శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాస్, ఈసీఈ హెచ్ఓడీ వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు, పాల్గొన్నారు.

గణిత పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సంపత్


చొప్పదండి: అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చొప్పదండి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సిరిపురం సంతోష్ సదిశ సంస్థ నిర్వహించిన గణిత ప్రతిభా పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. హెచ్ఎం వైద్యుల రాజిరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. సంస్థ ఏటా పరీక్ష నిర్వహించి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య అందిస్తోందని, విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరుచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాగభూషణం, సమత, పాల్గొన్నారు.

స్పార్క్ ఫెస్ట్–2023లో విద్యార్థుల ప్రతిభ

తిమ్మాపూర్: మైనారిటీ గురుకులాల సొసైటీ హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పార్క్ ఫెస్ట్–2023లో మండల కేంద్రానికి చెందిన మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి రెండు బహుమతులు సాధించారని ప్రిన్సిపల్ మాడిశెట్టి సంపత్ తెలిపారు. విజేతలకు మైనారిటీ గురుకులాల కార్యదర్శి బి.షఫీఉల్లాహ్ బహుమతులు ప్రదానం చేశారని పేర్కొన్నారు. పాటల పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థి షేర్‌ఖాన్ ప్రథమ బహుమతి, క్విజ్ పోటీలో ఇంటర్ సెకండియర్ విద్యార్థి జి.రిత్విక్ కారుణ్య ద్వితీయ బహుమతి సాధించారని తెలిపారు. సోమవారం కళాశాలలో విద్యార్థులను అభినందించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

● ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

జమ్మికుంట: గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ రాధాకృష్ణ వివరాల ప్రకారం.. మండలంలోని బిజిగిరిషరీఫ్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద 11వ నంబర్ పిల్లర్ ఇనుప చువ్వకు గుర్తు తెలియని 50 ఏళ్ల వయస్సుగల వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండురోజులుగా బిజిగిరిషరీఫ్ దర్గా సమీపంలో కందూరు చేసిన వారి వద్ద భోజనం అడిగి తీసుకున్నట్లు స్థానికులు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. బ్రౌన్ కలర్ రంగు షర్ట్, నలుపు, తెలుపు, నీలి గీతల లుంగి, తలపాగా ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

● రెండు నెమళ్ల మృతి

చొప్పదండి: మండలంలోని వెదురుగట్ట శివారులో రెండు నెమళ్లు మృతి చెందినట్లు గ్రామస్తులు గుర్తించారు. ఈ మేరకు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. గ్రామ శివారులో పంట చేనుకు పురుగుల మందు కొట్టగా, మృతిచెందిన పురుగులను నెమళ్లు తినడంతో ఆహారం విషంగా మారి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. అటవీ శాఖ అధికారి భరణ్ సిబ్బంది ద్వారా పంచనామా చేయించారు.

ట్రాక్టర్–వ్యాన్ ఢీ

- ఇద్దరికి గాయాలు



మానకొండూర్: మండలంలోని సదాశివపల్లి శివారులో సోమవారం ఉదయం ట్రాక్టర్–ఐచర్‌వ్యాన్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు అల్గునూర్ నుంచి వరంగల్‌వైపు వెళ్తున్న ట్రాక్టర్, వరంగల్ నుంచి కరీంనగర్‌వైపు వస్తున్న వ్యాన్ తీగల బ్రిడ్జి బైపాస్‌వైపుకు వెళ్తుండగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఈదులగట్టెపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్, వ్యాన్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు



మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్ శివారు యాదవనగర్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. మాట్లాడ లేని పరిస్థితిలో ఉండటంతో స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● 9 మంది బైండోవర్

జమ్మికుంట: పట్టణంలోని అబాది జమ్మికుంట, మండలంలోని సైదాబాద్ గ్రామానికి చెందిన తొమ్మిది మందిని తహసీల్దార్ రజని ఎదుట సోమవారం బైండోవర్ చేశామని టౌన్ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. ఎన్నికల నియమావళిలో భాగంగా అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు.

● పేకాటరాయుళ్ల అరెస్టు

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఆరుగురు పేకాట ఆడుతుండగా పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై ఆసిఫ్ తెలిపారు. వీరి నుంచి రూ.1,520 నగదు స్వాధీనం చేసుకున్నామని, మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్న మహేందర్, దాసారపు ప్రశాంత్‌పై కేసు నమోదు చేశామని, వీరి నుంచి రూ.2,870 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వివరించారు.